క్లుప్తంగా

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన



అనంతసాగర్‌లో ఇళ్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

కుల్కచర్ల: ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులు పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీఓ రామకృష్ణ అన్నారు. గురువారం ఆయన అనంతసాగర్‌లో కొనసాగుతున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో 162 మందికి ఇళ్లు మంజూరవగా 40 మంది పనులు ప్రారంభించారని తెలిపారు. దశల వారీగా బిల్లులు చెల్లిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ కేశవులు, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి దుర్మార్గం

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పులి మల్కయ్య



యాలాల: కశ్మీర్‌లోని పెహల్గాంలో భారత పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి దుర్మార్గమైన చర్య అని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పులి మల్కయ్య అన్నారు. ఉగ్రదాడుల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.ఇటువంటి చర్యలను భారత ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి తగిన గుణపాఠం చెప్పాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. భారత సైన్యంలో రెండు లక్షలకు పైగా ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ



ధారూరు బస్టాండ్ వద్ద కొవ్వొతులతో ర్యాలీ తీస్తున్న స్థానికులు

ధారూరు: కశ్మీర్‌లో భారతీయులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు హత్యాకాండకు పాల్పడంపై స్థానికులు మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం రాత్రి నిరసన ర్యాలీలు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు. ఈ కార్యక్రమంలో యువకులు, ధార్మిక సంస్థల సభ్యులు, వ్యాపారవర్గాలు, యువజన సంఘాలు పాల్గొన్నాయి.

మహిళా సమాఖ్య మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీని సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: మహిళా సమాఖ్య మండల నూతన అధ్యక్షురాలిగా సాల్వీడు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కావలి సంతోష ఎన్నికయ్యారు. గురువారం కుల్కచర్ల మండల కేంద్రంలోని రైతువేదికలో ఓటింగ్ పద్ధతిన నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా సంతోష, కార్యదర్శిగా సుధ, కోశాధికారిగా శ్రీలత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థిక ప్రగతి సాధించాలని సభ్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులు, సహకార సంఘం చైర్మన్ కనకం మొగులయ్య, ఏపీఎం శోభ, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, యువజన విభాగం అధ్యక్షులు జంగయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు సన్మానం

షాద్‌నగర్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఫలితాల్లో సత్తాచాటిన పట్టణ యువతి ఇంద్రార్చితను నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న ఇంద్రార్చిత ఇంటికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో పాటు ఆయా పార్టీల నాయకులు వెళ్లి శాలువాలు కప్పి సన్మానించారు. పట్టుదలతో చదివి సివిల్స్‌లో ర్యాంకు సాధించడంపై ఆమెను వారందరూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విశ్వం, బస్వం, కొంకళ్ల చెన్నయ్య, కొందూటి నరేందర్, ఎంఎస్ నటరాజన్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జోరుగా ఇసుక దందా

- యథేచ్ఛగా సాగుతున్న అక్రమ వ్యాపారం
- ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలింపు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, పోలీసు శాఖలు
- ప్రజలు పట్టించిన వాహనాలపైనా కేసులు చేయని వైనం



ఇటీవల పోలీసులు పట్టుకుని కేసు చేయకుండా వదిలేసిన టిప్పర్

దోమ: గ్రామాల్లో ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. కొంతమంది వాల్టా చట్టాన్ని ఉల్లంఘించి వాగులు, వంకల్లో ఇసుక తవ్వుతూ.. రాత్రిపగలు అనే తేడా లేకుండా ట్రాక్టర్లు, లారీల్లో తరలించి, సొమ్ము చేసుకుంటున్నారు. మరికొందరు ప్రభుత్వ పనుల పేరిట యథేచ్ఛగా ఇసుక తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఇదంతా తెలిసినా రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

రాత్రివేళ తరలింపు

మండల వ్యాప్తంగా ఇసుక దందా మూడు పువ్వులు, ఆరు కాయలు అనే చందంగా కొనసాగుతోంది. మండల పరిధిలోని మోత్కూర్, దిర్సంపల్లిలో కొందరు వ్యాపారులు ఇసుక ఫిల్టర్లు ఏర్పాటు చేసుకుని కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారు. దీన్ని ఇతర గ్రామాలకు తరలించి విక్రయిస్తున్నారు. గొడుగోనిపల్లి, మైలారం వాగులో సైతం ఇసుకను వ్యాపారులు రాత్రి వేళ ట్రాక్టర్లు నింపి తరలిస్తున్నారు. అటు రంగారెడ్డిపల్లి నుంచి కొందరు వ్యాపారులు దాదాపూర్ మీదుగా ఇసుక తీసుకువచ్చి మండల పరిధిలోని గ్రామాల్లో అమ్ముతున్నారు. ఇటు బొంరాస్‌పేట మండలంలోని కాకారవాణి ప్రాజెక్టుతో పాటు సమీప వాగుల నుంచి కొందరు అక్రమార్కులు లారీలు, టిప్పర్లలో ఇసుక తీసుకెళ్తున్నారు. బుద్లాపూర్ సమీపంలోని మక్తకుంట ఇసుక తెచ్చి పంట పొలాల్లో డంప్ చేస్తున్నారు. అనంతరం ట్రాక్టర్లలో నింపి అవసరమైన చోటకు తరలిస్తున్నారు.

అధికార పార్టీ నేతల ఒత్తిడితోనే..

బొంరాస్ పేట మండలంలోని మహంతీపూర్, దుప్‌చెర్లతో పాటు సమీప ప్రాంతాల్లోని వాగుల్లో నుంచి కొందరు అక్రమార్కులు ట్రాక్టర్లు, లారీలు, టిప్పర్ల ద్వారా యథేచ్ఛగా పరిగితో పాటు దోమ, కుల్కచర్ల మండలంలోని ఆయా గ్రామాలకు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో పాటు అదే మండలంలోని కాకరవేణి ప్రాజెక్టు నుంచి కొందరు వ్యాపారులు లారీలు, టిప్పర్లలో ఇసుకను తరలిస్తూ కాసులు పండిస్తున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లినా.. అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల నేపథ్యంలో ఏమీ చేయలేకపోతున్నారని తెలుస్తోంది.

పట్టుకుని అప్పగించినా..

ఇటీవల బుద్లాపూర్ గ్రామస్తులు ఓ టిప్పర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించినా ఎలాంటి కేసు నమోదు చేయకుండా వదిలేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గొడుగోనిపల్లి నుంచి కుల్కచర్ల వైపు ఇసుక లోడ్‌తో వెళ్తున్న టిప్పర్‌ను గ్రామస్తులు పట్టించారు. ఈ విషయంలోనూ ఎలాంటి చర్యలు చేపట్టలేదని చెబుతున్నారు. దిర్సంపల్లి వాగునుంచి కొందరు అనుమతుల పేరిట ఇసుకను అడ్డదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పత్రికల్లో కథనాలు వచ్చిన సమయంలో లేదా ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప పోలీసులు పట్టించుకోవడం లేదు. దీంతో నేరుగా టాస్క్‌ఫోర్స్ అధికారులే దాడులు చేస్తున్నారు. ఇటీవల ఓ ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

కేసులు నమోదు చేస్తాం



ఇసుక అక్రమ వ్యాపారం చేస్తున్న వారిపై కేసులు నమోదు చేస్తాం. సంబంధిత వాహనాలను రెవెన్యూ అధికారులకు అప్పగిస్తాం. ఇసుక వ్యాపారం చేసేవారు విధిగా అనుమతులు పొంది ఉండాలి. లేదంటే చట్టరీత్యా చర్యలు తప్పవు. ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాం.

– ఆనంద్ కుమార్, ఎస్ఐ, దోమ

పేదవారి కోసమే 'భూ భారతి'

- 'ధరణి' ఇబ్బందులు ఇక ఉండవు
- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



యాలాల: అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

యాలాల: కాంగ్రెస్ ప్రభుత్వం పేద వారి కోసమే భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన ధరణితో ఎంతో మంది ఇబ్బంది పడ్డారని తెలిపారు. అలాంటి అవస్థలు లేకుండా ఉండేందుకే భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెస్తున్నట్లు స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ అంజయ్య, డీటీ కిరణ్‌కుమార్, సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ నర్సిరెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్, రాజు, మొగులయ్య, కో ఆప్షన్ మాజీ సభ్యుడు అక్బర్‌బాబా, బీసీ సెల్ మండల అధ్యక్షుడు అమృతయ్య, నాయకులు హన్మంతు, మహిపాల్, భీమప్ప తదితరులు ఉన్నారు.

భూభారతి సదస్సు 28వ తేదీకి వాయిదా

ధారూరు: ధారూరులో శనివారం నిర్వహించాల్సిన భూ భారతి అవగాహన సదస్సును సోమవారానికి వాయిదా వేసినట్లు తహసీల్దార్ సాజిదాబేగం తెలిపారు. మండల ప్రజలు, అన్ని పార్టీల నాయకులు, ఆయా శాఖల అధికారులు ఈవిషయాన్ని గుర్తించి, సోమవారం సభకు హాజరు కావాలని సూచించారు.

గురుస్వామి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పూజలు



గురుస్వామి ఉత్సవాల్లో ఎమ్మెల్యే యాదయ్య తదితర పాల్గొన్నారు

నవాబుపేట: మండల పరిధిలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో రెండు రోజులుగా నంది గురుస్వామి ఉత్సవాలు ఘనంగా కొనసాతున్నాయి. ఎమ్మెల్యే కాలె యాదయ్య దంపతులు గురువారం పూజల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తిభావాలను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ గీతాసింగ్ నాయక్, నాయకులు నాగిరెడ్డి, వెంకట్ రెడ్డి నరసింహారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, బీరయ్య, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభకు తరలిరావాలి



శుభప్రద్ పటేల్

అనంతగిరి: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ సభకు లక్షలాదిగా తరలిరావాలని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భవించి 25 వసంతాలు అవుతున్న నేపథ్యంలో నిర్వహిస్తున్న వేడుకలను విజయవంతం చేయాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్త, నాయకుడిపైనా ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్‌పై పార్టీ అధినేత కేసీఆర్ ఈ వేదిక నుంచే సమరశంఖం పూరించే అవకాశం ఉందని తెలిపారు. ఇకనుంచి ఏ ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ ఘన విజయాలు సాధిస్తుందని ధీమా వ్యక్తంచేశారు.

చలివేంద్రం ప్రారంభం

కొత్తూరు: ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సిద్ధాపూర్ గ్రామంలో గురువారం స్థానిక బీజేపీ నాయకుడు హరికృష్ణచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాధ్యమైనంత వరకు ప్రజలు ఎండలో బయటకు రావొద్దన్నారు. తప్పనిసరిగా రావాల్సిన వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శ్రీధర్‌చారి, కొండల్‌చారి, జనార్దన్‌చారి, భైరమోని నర్సింహ, ఇంద్రసేనారెడ్డి, నరేందర్ రెడ్డి, మల్లేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న తిరుపతిరెడ్డి

కొడంగల్: మండల పరిధిలోని తొమ్మిది గ్రామాలకు చెందిన 24 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.24 లక్షల విలువైన కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల రేవంత్‌రెడ్డి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేదింట పెళ్లి జరిగితే తెలంగాణ ప్రభుత్వం రూ.లక్ష సాయం అందజేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, పీఏసీఎస్ చైర్మన్ శివకుమార్ గుప్త, కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, ఏఎంసీ చైర్మన్ అంబయ్యగౌడ్, కృష్ణంరాజు, నయీమ్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



దుద్యాలలో చెక్కులు పంపిణీ చేస్తున్న తిరుపతిరెడ్డి

దుద్యాల్: మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తిరుపతిరెడ్డి గురువారం చెక్కులు అందజేశారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డలకు ప్రభుత్వం అందజేస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో మహేశ్ కుమార్, ఎంపీఓ సత్యనారాయణ, డీటీ వీరేశ్ బాబు, జిల్లా గ్రంథలయ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడి.. మృతులకు నివాళి



ఉగ్రవాదానికి వ్యతిరేకంగా హిందువుల ర్యాలీ



భారీ ర్యాలీలో పాల్గొన్న హిందువులు

తాండూరు టౌన్: పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన భారతీయులకు పట్టణ ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. గురువారం హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో గంజ్ ఎల్లమ్మ ఆలయం నుంచి పురవీధుల మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. పార్టీలకు అతీతంగా హిందువులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. అనంతరం పాకిస్తాన్ జెండాను తగలబెట్టారు.



గౌరారంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు



పుట్టపహాడ్‌లో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నేతలు

ప్రభుత్వ కేంద్రాల్లోనే 'మద్దతు'

- దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు
- మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్
- గౌరారంలో కొనుగోలు సెంటర్ ప్రారంభం

దుద్యాల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరికి మద్దతు ధర లభిస్తుందని కొడంగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్ అన్నారు. మండల పరిధిలోని గౌరారంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టించి పండించిన పంటలను అమ్ముకునే సమయంలో చాలా మంది రైతులు దళారులకు కట్టబెడుతున్నారని తెలిపారు. దీంతో తూకం, ధరలో మోసపోయి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు అండగా ప్రభుత్వం ముందస్తుగానే వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. ఏ గ్రేడ్ ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320, బి గ్రేడ్‌కు రూ.2,300 చెల్లిస్తోందని తెలిపారు. వరి కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవుటి శేఖర్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి మెరుగు వెంకటయ్య, నాయకులు సీసీ వెంకటయ్య, సీతారాంనాయక్, పులిందర్‌రెడ్డి, సాగారంతండా గ్రామ అధ్యక్షుడు నరేశ్ రాథోడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అంతారం, పుట్టాపహాడ్‌లో..

కుల్కచర్ల: ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కుల్కచర్ల పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, కుల్కచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని అంతారం, పుట్టపహాడ్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ బక్కారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్‌కుమార్‌రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్య, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, ఉపాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రాజశేఖర్‌గౌడ్, మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు



టేకులపల్లిలో పంచాయతీ కార్మికులను సన్మానిస్తున్న కార్యదర్శి మాధవి



అనంతసాగర్‌లో గ్రామసభ

కుల్కచర్ల: పంచాయతీరాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని జీపీల్లో గురువారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీల పాత్రను తెలియజేశారు. అనంతసాగర్ సభలో కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాలనలో పంచాయతీలు కీలకం..

మోమిన్‌పేట: మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ వ్యవస్థ ప్రాముఖ్యతను వివరించారు. టేకులపల్లిలో సెక్రటరీ మాధవి పంచాయతీ కార్మికులను సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పాలనలో పంచాయతీలు కీలకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు మల్లారెడ్డి, సాయికుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రహదారుల అభివృద్ధికి కృషి

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

అనంతగిరి: జిల్లాకు అధిక నిధులు తీసుకువచ్చి రహదారులను అభివృద్ధి చేస్తామని శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. మదన్‌పల్లి వద్ద రూ.4.45 కోట్లతో కొత్తగడి నుంచి బంట్వారం వరకు చేపట్టిన రోడ్డు పునర్నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.కోటి 81 లక్షల వ్యయంతో అనంతగిరి గుట్ట నంది విగ్రహం వరకు నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మెరుగైన రవాణా వసతులు కల్పించేందుకు ఎన్ని నిధులైనా వెచ్చిస్తామని తెలిపారు. అనంతరం అటవీ శాఖ అతిథి గృహ ఆవరణలో రూ.3 కోట్ల వ్యయంతో చేపడుతున్న నాలుగు కాటేజీలను స్పీకర్ పరిశీలించారు. ఇందులో భాగంగా అనంతగిరిగుట్ట రహదారి పక్కన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, డీసీఎంఎస్ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్రీధర్‌రెడ్డి, ఎంపీడీఓ వినయ్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్: ప్రభుత్వం అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఆరుగురు గెజిటెడ్ అధికారులను నియమించారన్నారు. ఈ నెల 30 వరకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదికను అందిస్తామని తెలిపారు. లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరలోనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో గెజిటెడ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న ఎంపీడీఓ బన్సీలాల్, గెజిటెడ్ అధికారులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622